# రిజిష్ట్రారు మోహన్

శ్రీ నాయని శేషాచలరావు బి. ఏ.,

"అయితే నేమి' అని అన్నాను" మోహానుడు చెప్ప నారంభించాడు.

"ఎవరితో" అని నేను అన్నాను.

"రిజిష్ట్రారు ఆఫీసున బంట్రోతుతో. బాదం కలరు సిల్కు సూట్యుటున శీఘ్రగ కుర్చీలో కూర్చుని" అని మోహానుడు జవాబిచ్చెను.

"అయితే నీవు రిజిష్ట్రారువా?" అని నేను ప్రశ్నించాను.

"సబ్ రిజిష్ట్రారు ననే అనుకున్నాను." అని మోహానుడు చెప్ప నారంభించెను నిజముగా తాను ఆ హోదా ననుభవించినట్లు.

"పైన పంకా, సినిమాలో మృగేక్షణ వైరుల చేతిలోబడి గింజుకున్నట్లు గింజుకుంటూ వున్నది. బంట్రోతు రామయ్య పంచి కొంగు పైకి మడతబెట్టి, నడుమునకు కండువా బిగించి, ఎదుట సిద్ధపడ్డాడు. ఇంతలో ఆఫీసు గంట పదకొండు కొట్టినది."

"సర్. పదకొండు కొట్టినది" అని అన్నాడు రామయ్య, తన తలపాగా రెండు చేతులతో సవరించుకొనుచు.

వినీవినిపించుకొనక, కాలుతూవున్న సిగరెట్టును వినోదముగ చూచుచు, 'అయితే నేమి' అని నేను అన్నాను.

సిగరెట్టుపొగ, పైన పంకా గాలికి, యివతల రామయ్య హడావిడికి జడసి, అవతల అప్పుల వారి బాధ, యివతల రిజిస్ట్రేషన్ల బాధ బడలేక గుండెలు చెదరగొట్టుకొనుచున్న పార్టీలవలె చెదరి పోతూ వున్నది. ఈ వినోదమును జూచుచు నేను వున్నాను.

'రిజిష్ట్రారు ఆఫీసులో, నిమిషమొక వరహా విలువండి' అని రామయ్య అన్నాడు, పెద్ద యూనివర్సిటీ కాలేజి ఎకానమిక్సు ప్రొఫసరు(Economics professor) కున్న విజ్ఞానముకన్న తన కెక్కుడు విజ్ఞానమున్నట్లు' అని మోహానుడన్నాడు.

"మును పెప్పుడో గ్రే (Gray) చెప్పెను మిల్టన్లు, షేక్సిపియర్లు బూజెక్కి విలేజి గోరీలలో పడి ద్రొళ్లుచున్నారని, అది జ్ఞాపకమునకు వచ్చినదా" అని నేను అన్నాను.

"ఏది జ్ఞాపకమున్నను లేక పోయినను ఒక్కటి మాత్రము జ్ఞాపక ముంచుకొనవలెను. రిజిస్ట్రారాఫీసుల (Value of time) ఏ మిల్టన్‌కు తెలియదు. ఏ షేక్సిపియరునకు తెలియదు. అర్థశాస్త్రజ్ఞుని మించి వాడు నిమిషమింత విలువని రూపాయలలో కొలతవేసి చెప్పినందులకు నాకెంతో ఆశ్చర్యమయినది. చూడు నిమిషము వరహా విలువఅయిన, గంట విలువ అరవై వరహాలు. అరవై ఆర్లు మూడువందల అరువై. అనగా రిజిష్ట్రారు ఆఫీసు తెఱచిన పదకొండు మొదలు అయిదు వరకుగల కాలము మూడువందల అరువై వరహాలతో సమానము" అని మోహానుడు చెప్పెను.

"అయితే, ఇప్పుడు దాని లాభమే"మని నేను మోహానుని ప్రశ్నించాను.

ఇప్పుడొక మానమేర్పడినది. ఒక రూపాయి=16 అణాలని చెప్పినట్లు, రిజిష్ట్రేషన్ డిపార్టుమెంటులో ఒక దినము =360 వరహాలు లేక రూ. 1440. అని చెప్పవచ్చును." అని మోహానుడన్నాడు.

"ఈలాగున అన్ని డిపార్టుమెంట్లు అంచనా వేసి చెప్పెదవా ఏమి" అని నేను అన్నాను

"ఆహా! మునసబుకోర్టు తీసుకొనవచ్చును మరి

యొక్క వుదాహరణగా. అయిన మునసబుకోర్టున యొక్క విచిత్రమున్నది" అని మోహానుడన్నాడు.

"ఏమా విచిత్రము" అని నేను ఆశ్చర్యముతో నన్నాను.

"ఇక్కడ పెర్‌మిటేషనులు, కాంబినేషనులు (Permutation and combination) అమలులోనికి తెచ్చుకొనవలెను. ఇక్కడ గుమస్తాలు, బంట్రోతులే కాదు లెక్కలోనికి రావలసినది. ఆఫీసులో వున్న స్తంభములు, గోడలుకూడ లెక్కలోనికి రావలెను" అని మోహానుడన్నాడు.

"స్తంభములు, గోడలు ఎందులకు" అని నేను ప్రశ్నించాను.

"వీనికికూడ మామూళ్లడుగు శక్తి వున్నది. మన్న ప్రామిసరీనోటును దాఖలుచేయుటకు మునసబుకోర్టునకు బోయి, స్తంభము నానుకొని నిలుచుని వుండగా స్తంభములోనుండి చేయి పైకి సాగి మామూలుకొరకు నన్ను పెనవేసుకొన్నది." అని మోహానుడన్నాడు.

"బేష్" అని నేను అన్నాను.

"బేష్ కాదు 'శబాష్' అను. అక్కడ అంచనా వేయుటకు క్రొత్త సూత్రము అమలులోనికి పెట్టవలెను."

$$\frac{(\text{స్తంభములు} + \text{గోడలు})}{2} \times \frac{(\text{కోర్టు గుమస్తాలు} + \text{అమీనాలు})}{2}$$

"బంట్రోతులు లేరా ?" అని నేను ప్రశ్నించాను.

"లేకేమి. పైవచ్చిన లబ్ధమును ఎంతమంది బంట్రోతులున్న అన్నిసారులు హెచ్చించవలెను" అని మోహానుడన్నాడు.

"పది స్తంభములు, పదిగోడలు, పదిమంది కోర్టు గుమస్తాలు, పది అమీనాలు, పదిమంది బంట్రోతులున్న, $(10+10)^{10}=100^{10}$ అన్నమాట." అని నేను అన్నాను.

"అవును. కోర్టు మనుష్యునకు సరాసరి రాబడి గంటకు పావలా అయిన ఒక కోర్టుగంట$=100^{10}$ పావలాలు అని గంటాపదముగా జెప్పవచ్చును" అని మోహానుడన్నాడు.

"అయితే. రిజిస్ట్రేషన్ దినము యిన్ని రూపాయలు, కోర్టుగంట$=100^{10}$ పావలాలు, స్కూలువారము యిన్ని దమ్మిడీలు అని పట్టీవేసి చెప్పెదవా!!" అని నేను అన్నాను

"స్కూలునకేమున్నది సుద్దముక్కలు, స్కూళ్ళ యిన్‌స్పెక్టర్ల మెమోలు తప్ప. కాని ఏనుగు బ్రతికినా ఖరీదే చచ్చినా ఖరీదే అన్నట్లు, పోలీసులు పట్టిన ఖూని నెగ్గినా పదివేలు, పోయిన పదివేలు. ఒక పోలీసుఖూని= 10,000 రూపాయలని చెప్పవలసి వస్తుంది" అని మోహానుడన్నాడు.

"అసలు సంగతి మాని లేనిపోని ప్రసంగములలో దిగావు" అని నేను కోపముతో అన్నాను.

"లేనిపోని ప్రసంగములకు చెవియొగ్గే డిపార్టుమెంట్లవి కావు. అవన్ని రెడీకాష్ డిపార్టుమెంట్లు. చేతులో డబ్బు పడినగాని మాట్లాడవు." అని మోహానుడు సమాధాన మిచ్చాడు.

"తరువాత ఏమయినది" అని నేను విసుగుతో అన్నాను.

"సబ్‌రిజిష్ట్రారునసే సగర్వము నాలో తాండవ మాడినది. సగము కాలిన సిగరెట్టును కిటికీనుండి అవతలకు విసరి, 'రామయ్యా దస్తావేజులను రమ్మనమను' అని అధికారసూచకముగా నన్నాను. అంతే ముప్పైనలభై దస్తావేజులు రామయ్య అందుకొని నాబల్లపైన పెట్టెను. దస్తావేజులను విప్పిచూచితిని కాని నేను అనుకున్నదేమనగా, దస్తావేజునకు పదిరూపాయలు నోట్లో; అయిదురూపాయలు నోటో గ్రుచ్చి వం పుతారనుకున్నాను. కాని చూచిన, ఏ దస్తావేజునకు అవిధముగా

రాలేదు. 'రామయ్యా! మాట' అని రహస్యముగా రామయ్యను పిలిచాను. 'చిత్తమని' రామయ్యా తన చెవిని నాపెదవుల దగ్గరకు తెచ్చి అతిశ్రద్ధగా నిలుచున్నాడు. రిజిష్ట్రార్లు మామూళ్లు పుచ్చుకుందురు గదా ఎప్పుడు పుచ్చుకుందురేమి?" అని నేను అడిగాను. 'అదంతా ప్రైవేటు సర్' అని రామయ్యా చెవులో వూదాడు.

"ప్రైవేటేమిటి. పబ్లికేమిటి. మామూళ్ళ రివాజు మానకూడదు." అని నేను అన్నాను.

రామయ్యా వెళ్లి పార్టీలలో ఏమి వూదాడో తెలియదు. కాని కాసేపటికి పార్టీలలో గుసగుసలు బయలుదేరినవి.

"చల్ది అంత వూరగాయ ఎక్కడన్నా కద్దా" అని వొకడు సంసార ధోరణిలో అన్నాడు.

"ఎంత రిజిష్ట్రేషన్ ఫీ వుంటే అంత పైన పుచ్చుకొనుటా" అని మరియొకడు "లా" పుస్తకములు తిరగవేసినట్లు చెప్పనారంభించాడు.

"అతి దారుణముగావున్నది అని జెనరల్ (సామన్య) పదము మరియొకడు విసిరాడు.

"పోలీసు డిపార్టుమెంటును మించి పోయినది వెధవ రిజిష్ట్రేషను" అని మరియొకడు "కలేసికొట్టరా కస్తూరి రంగా" అన్నట్లు పలికాడు.

నాకు చిరాకు వేసినది. "రామయ్యా తిట్టితే రిజిష్ట్రేషన్‌ను తిట్టమను, రిజిష్ట్రారుని తిట్టిన మాటదక్కదని చెప్పు. దేవుళ్ళదగ్గరకు, ఆఫీసర్ల దగ్గరకు, సానుల దగ్గరకు వెళ్లువారు తృణమో కణమో తీసుకుని గాని పోరాదు. ఆమాత్రము తెలియదు" అనినేను మూతి బిగించుకుని, కోపముగా, కొంపలు ముంచేటట్లు కేకలు వేసాను.

"మామూళ్ళేడ్చేవాడవు చాటుకుండా ఏడవక మధ్య యీ జబరదస్తీ వ్యాపారమేమిటి"అని నేను మోహనునితో అన్నాను.

"ఏడ్చేవారు ముందే ఏడవక మమ్ములను ఏడ్పించి ఏడ్పించి యివ్వడమేమిటి. ముందే మామూళ్లు పారేసిన ఎంత ముద్దుగా వుండేది" అని మోహనడన్నాడు.

"మామూళ్ల కొరకా రిజిష్ట్రార్లు పుట్టినది" అని నేను కోపముతో అన్నాను.

"కాదు రిజిష్ట్రార్లు కొరకు మామూళ్లు పుట్టినవి" అని మోహనుడు మొండి సమాధాన మిచ్చాడు.

"బాబు! రిజిష్ట్రారుగారు! నేను ఆడకూతుర్ని. చాలామైళ్ల దూరమునుండి వచ్చానండి తర్వగా పంపించి వెయ్యండి" అని నడివయస్సు స్త్రీ ఆఫీసు గదివద్ద నిలుచుని గోలపెట్టినది.

"ఆడదాని చేతులనుండికూడ లంచములు పుచ్చుకొన వలసినదేనా రిజిష్ట్రారు" అనే సమస్య నాలో నాకే పుట్టినది.

"ఏమోయి రామయ్యా! ఏమంటావు" అని నేను రామయ్యను అడిగాను సూజాయగా.

"మామూలేసర్" అని రామయ్యా నన్ను హెచ్చరించాడు.

"ఎవడోయి ఆరామయ్య" అని నేను గట్టిగా మోహనున్ని అడిగాను.

"చెప్పలేదు. రామయ్యా ఆఫీసు బంట్రోతు" అని మోహనుడు తడుముకొన కుండ జవాబిచ్చాడు.

"మంచి వాడ్నే సంపాదించావు" అని నేను అన్నాను.

"మంచివారినే జతకూరుస్తారు రిజిస్ట్రేషన్ లా" అని మోహనుడన్నాడు.

"తరువాత సంగతి విను. ఒక దస్తావేజును తీసి చూచేటప్పటికి నాకు ఆశ్చర్యము వేసినది. ఎవరిది దస్తావేజు" అని బెదరి కేక వేసాను. పదిహేను స్టాంపుఖర్చు. రిజిష్ట్రేషన్ ఖర్చు పదిరూపాయలు. నామామూలు పది.

మొత్తము ముప్పై అయిదయినది!! దస్తావేజు వ్రాసినందులకు ఖర్చు "ఎంత" అని ఆపార్టీని అడిగాను.

"నా అవసరమును బట్టి నాలుగురూపాయలు పుచ్చుకున్నానండి ?" అని ఆవ్యక్తి సగము వూపిరితో అన్నాడు.

"ఎఱుక సాక్షులకు"

"సాక్షులను తీసుకొని వచ్చినందులకు బండ్లఖర్చులు వారికి హోటలు ఖర్చులు అమామా బాపతు అయిదు రూపాయలు పూర్తి అవుతవి" అన్నాడు ఆవ్యక్తి.

"ఇక్కడ యిద్దరు గుమస్తాలకు రెండు అరణాలు" బంట్రోతు రామయ్యకు పావలా మొత్తము నలభై అయిదు రూపాయలు!! అని నేను అన్నాను.

"అవునండీ" అని ఆపార్టీ ఏడ్వలేక నవ్వుతూ అన్నారు.

"అబ్బా! ఒక దస్తావేజునకు నలభై అయిదు రూపాయలు ఖర్చా" అని ఒక నిట్టూర్పు విడిచాను.

"ఇదింకా చిన్న దస్తావేజండి" అని మా ఆఫీసు గుమస్తా అతి నిదానముగా నన్నాడు.

"ఏమి చిన్న దస్తావేజయ్యా! ఇటువంటివి యిరువై తొమ్మిదివందలు. ఒక చిన్న రిజిస్ట్రేషన్ ఆఫీసు వల్ల రోజునకు ఖర్చు తొమ్మిదివందలా!! దేశమేమి బాగు పడుతుందని గోల పెట్టాను" దేశముబాగోగులంతా నాలోనవున్నట్లు.

"మీజీతముల ఖర్చులు యివన్ని ఎక్కడనుండీ వచ్చును" అని నేను అన్నాను.

"మాజీతముల ఖర్చే మున్నది రిజిస్ట్రారునకు రోజునకు నాలుగు రూపాయలు. పెద్ద గుమస్తాకు రెండురూపాయలు. చిన్న గుమస్తాకు రూపాయిన్నర. బంట్రోతునకు అర్ధరూపాయి. అంతయు కలసి ఎనిమిది రూపాయలు. ఎక్కడ ఎనిమిది, ఎక్కడ తొమ్మిది వందలు" అని నేను నిర్ఘాంతపడ మోహను డన్నాడు

ఇందులో నీలంచము కూడ కలుపుకున్న ఏమి తేలుతుంది" అని నేను అన్నాను.

"లంచమా. లంచమా. అని అనెదవేమి. ఎనిమిదణాల ఏనాము సిల్కు షర్టునకు కుట్టుకూలి ముప్పావలా యివ్వలేదు" అని మోహనుడన్నాడు.

"కుట్టినందులకు కూలి యిస్తున్నాము గాని అప్పనముగా యివ్వలేదు" అని నేను అన్నాను.

"కూలీ క్రిందయిచ్చిన కష్టార్జితమస్తు. అప్పనముగా వచ్చినది శ్రీ కృష్ణార్పణమస్తు. అవుతుంది. అంతే తేడా" అని మోహనుడన్నాడు.

"ఇంతకు రిజిస్ట్రారులై చేసిన పని ఏమి" అని నేను అన్నాను.

"రిజిస్ట్రారు చేసేది రిజిస్ట్రేషను. రిజిస్ట్రేషన్‌ను చేసేది రిజిస్ట్రారు. సబ్‌రిజిస్ట్రారు మోహను ఒకటి రిజిస్టరుచేసాడు" అని మోహనుడన్నాడు.

"ఏమది" అని నేను ప్రశ్నించాను.

"రిజిస్ట్రేషన్ ప్రజల తత్వమునకు పనికిరాదని" మోహను డన్నాడు.

"నీవు రిజిస్ట్రారులై అసంగతి అనకూడదు" అని నేను మోహనుని మందలించాను.

"అనేవేమిటి. అందరకు తెలిసినభాగవతమే. రోజునకు ఒక రిజిస్ట్రారు ఆఫీసు వల్లరాబడి తొమ్మిది వందలు కనుపిస్తువుంటే" జిల్లాలో పది రిజిస్ట్రారు ఆఫీసులున్న తొమ్మిదివేలు కనుపిస్తూవుంది. ఇటువంటి జిల్లాలు రాజధానికి ఇరువై అయిదు వున్న రోజునకు ప్రజలవద్దనుండి వూడే డబ్బు రెండు లక్షల ఇరువై అయిదువేలు తేల్తూ వున్నది. వారమునకు (ఆరురోజులే అనుకుంటే) పదమూడు లక్షల ఏబదివేలు కనుపిస్తూవుంది. నెలకు ఏభైనాలుగు లక్షలు. సంవత్సరమునకు అరవైనాలుగు కోట్లు అయినది" అని మోహనుడు చెప్పాడు.

"అంతటితో వూరుకున్నావేమి. పుష్కరామున కిన్ని కోట్లవుతుంది. శకమున కిన్ని వేల లక్షల కోట్లవుతుం దని అంచానా వేయలేకపోతివా" అని నేను నవ్వు ఆపుకో లేక చెప్పాను.

"అరణాకు గిద్దెడు కాఫీ అమ్మేదు దినములలో, అరవైనాలుగు కోట్ల రూపాయలు ప్రజలనుండి పోతూ వుంటే దేశమేమి సారవంతమై వుంటుందోయి అని మోహ నుడు అన్ని సారములు నెఱింగిన రసజ్ఞుడివలె చెప్పాడు, తానన్నది నిస్సారమైనదని ఎఱుగక.

"నీవంటి వారు ఇద్దరు రిజిస్ట్రారులున్న చాలా రిజి స్ట్రేషన్ పరువు ఒక్క క్షణములోపోయి వూరుకుంటుంది అని నేను చిరునవ్వుతో అన్నాను.

"పరువుగల రిజిస్ట్రార్లు నీబోటివారు పదిమంది చేరి దేశము పరువు నిలబెట్టండి. అదే చాలు అని మోహను డన్నాడు.

"దేశమునకు పరువేమిటి పచ్చేమిటి, దోరేమిటి, ఎండేమిటి దేశమునకు యీఅవస్థలులేవు" అని రెట్టమత సిద్ధాంతమును అనుకరించి నేను చెప్పాను.

"దేశము పరువంటే ప్రజల పరువన్నమాట. ప్రజల పరువు నిలబెట్టండి" అని మోహనుడన్నాడు.

"చాలులే. ప్రజలపరువు కేలోపమొచ్చినది" అని నేను అన్నాను.

"ఏలోపము రాకపోవడమేమి. యంత్రములు బెట్టి చెఱువులోని నీరును తోడివేసినట్లు తోడివేస్తున్నారు ప్రజలనుండి డబ్బును" అని మోహనుడన్నాడు మోహాము ఎఱ్ఱజేసుకుని.

"నీ మొహము. వూరుకోవోయి. గాలికి బెదరి నట్లు బెదురుచున్నావేమి. నీ అంచనా సరియైనదనియా? నూటికి ఏభై వంతులు తీసివేయవలసినదే" అని నేను అన్నాను.

"అయితే. ముప్పదిరెండుకోట్లు ఖర్చు వొప్పు కుంటూ వన్న మాటేనా" అని నాకు అడ్డతిరిగాడు.

"అయితే అవుతుంది" అని విసుగుతో అన్నాను.

"అయితే అవడమేమిటి. అవుతూ వుందా? లేదా?" అని రెట్టించిఅన్నాడు నాచేత వొప్పించవలె నని.

"మధ్య ఏమయితే నాకెందుకు. రిజిస్ట్రారులై బాదంకలరు సిల్కుహ్యాటులో కూర్చుని ఏదో వుద్ధరించెద వని అనుకుంటే, మధ్యను నన్ను పట్టుకుని తోమెద వం దుకూ" అని నేను అన్నాను.

"రిజిస్ట్రారునై వుద్ధరించెడి దెవరిని? ఎవరినీ లేదు. వుద్ధరిస్తే అతనిజీవితము అతని కుటుంబమును వుద్ధరిస్తుంది. పైన మామూళ్ళు వస్తే అతని హ్యాటును, అతని సిజర్ సిగరెట్ల పెట్టెలను వుద్ధరిస్తుంది" అని మోహనుడన్నాడు.

"అయితే. రిజిస్ట్రారెందుకయావు" అని నేను మోహనుని ప్రశ్నించాను.

"నేను అయునా ఏమి? కలలో వస్తే కంగారు పడ్డాను" అని మోహనుడు జవాబిచ్చాడు.

"నిజముగా రిజిస్ట్రారు వుద్యోగమిచ్చినా వద్దనె దవా?" అని నేను అడిగాను.

"నేను వద్దనడమే కాదు. నీకిచ్చినా అంగీకరించ వద్దంటాను" అని మోహనుడు అతి గాంభీర్యముగా జెప్పాడు.

"ద్రాక్షపండ్లు అందని నక్క యిలాగునే అను కున్నది, ద్రాక్షపండ్లు చేదుగా వుండునని" అని నేను అన్నాను.

"చేదుగావుండునని కాఫీ. చేదుకాఫీ త్రాగిన గాని మోక్షమురాదు. పద. కాఫీ హోటలునకు. ఆనక మాట్లాడుకోవచ్చు" అని మోహనుడు దారి తీసాడు కాఫీ హోటలునకు. వాడి వెఱ్ఱితనమునకు నాకు నవ్వు వచ్చినది నీడనుజూచి బెదిరే రకము.